## ఈ వారం కథ

# మధ్యతరగతి మానవుడు


### వల్లమూడి దుర్గాంబ

మధ్యాహ్నం బడినుండి వచ్చిన తన కొడుకు బాబికి, అక్క కూతురు శాంతికి అన్నం పెట్టి – మళ్ళీ బడికి పంపించి – భర్త దగ్గరికి వచ్చింది విజయ. "శాంతి ఈ రోజు కూడా ఇటే వచ్చిందే!" ఏదో ఆలోచిస్తూ – తనలో తాను అనుకున్నట్టుగా అన్నాడు దివాకర్ భార్య వంక చూస్తూ.

"నాకూ అదే అర్థం కావడం లేదండీ" భర్త ఎదురుగా సోఫాలో కూర్చుంటూ అంది విజయ. ఇద్దరూ మౌనంగా ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. ఇరువురి ఆలోచనల రూపం ఒక్కటే! సారం ఒక్కటే!

పాపని ముద్దుగా ఒక్క వారం తన దగ్గర వుంచుకుంటానన్నా ఇష్టపడని తన అక్క, అలా పంపడం – 'తమ కిలేకా' అనే దృష్టిలో ఆలోచించి అభిమానపడే అక్క – నాలుగయిదు రోజులుగా మధ్యాహ్నం భోజనానికి బాబిగాడితో పాటు శాంతి ఇటే వస్తున్నా పట్టించుకోనట్టు . వుండిపోయిందంటే కారణం – కారణం ఏమై వుంటుందో వూహించగలుగుతున్నా – అదే అని ఒప్పుకోవడానికి మనసు అంగీకరించడంలేదు విజయకి. దివాకర్ పరిస్థితీ అలాగే వుంది. అందుకే ఇద్దరూ మాటలు రానట్టు మౌనంగా వుండిపోయారు.

విజయ అక్క జయ వాళ్ళు కూడా అదే వూళ్ళో వుంటున్నారు. జయ భర్త శ్రీనివాస్. వాళ్ళ ఒక్కగానొక్క సంతానం శాంతి. శ్రీనివాస్



మంచివాడే! కానీ – మొదట సరదాగా – తరువాత అలవాటుగా – ఆటుపై వ్యసనంగా మారిన తాగుడు – ఇప్పుడు అతని మంచితనాన్ని కనిపించనీయని చీకటి తెర అయింది. అది అతని కుటుంబం మొత్తాన్ని కమ్ముకుంది.


జయ లాగానే అతనూ అభిమానధనుడే! ఆ ఒక్క అపశ్రుతి లేకపోతే అతను అన్నివిధాలా ఉన్నతుడే! అందుకే అతనికి ఎవరూ చెప్పలేకపోయారు. అతని పరిస్థితి రోజురోజుకి దిగజారుతోందని తెలుసు. కానీ భార్యా కూతుళ్ళకి కడుపునిండా తిండిపెట్టలేని స్థాయికి దిగజారిందా! శాంతి మధ్యాహ్నం భోజనానికి పిన్ని ఇంటికి రావడానికి కారణం అదేనా!

సాయంత్రం భర్త, కొడుకులతో కలిసి అక్క ఇంటికి వెళ్ళింది విజయ. శ్రీనివాస్ ఇంట్లో లేడు. ఉంటాడని వాళ్ళేమీ అనుకోలేదు కూడా.

"మీ బావగారు రావడానికి చాలా లేట్ అవుతుంది" వాళ్ళని వెళ్ళిపొమ్మని చెప్పలేక అప్పటికి ఆ మాట ఆరుసార్లు అంది జయ. దివాకర్ కూడా అదే పాట పాడుతున్నాడు. 'వెళ్ళిపోదాం' అని భార్యకి చెప్పలేక! కానీ విజయలో మాత్రం చలనం లేదు. భోజనం టైం దాటిపోతున్నా – కనీస మర్యాదకైనా – చెల్లెల్ని మరిదిని భోజనం చేయండి – అనలేని అసహాయస్థితిని తప్పించుకోలేక – ఉక్కిరిబిక్కిరి అవుతోంది జయ.

విజయ కర్థమవుతూనే వుంది. కష్టమంటే ఏమిటో తెలియకుండా – తమ ఇంటి మహారాణిలా పెరిగిన అక్కని ఆ స్థితికి తెచ్చిన బావగారి మీద – క్షణక్షణానికి కోపం తారాస్థాయి నందుకుంటోంది.

జయ అదృష్టమో – దురదృష్టమో కూడా చెప్పలేం కానీ – ఆ రోజు శ్రీనివాస్ తొమ్మిదింటికే ఇంటికి వచ్చాడు. మనిషి కూడా పూర్తిగా మునిగిలేడు. అతని మొహంలో



సగం నిషా – పూర్తిగా తాగేందుకు అప్పు దొరకని చిరాకు సగం – మేళవించి చిత్రంగా కనబడుతున్నాడు. వేళకాని వేళలో – మరదలిని, తోడల్లుడిని చూడగానే తడబడ్డాడు. అది తాగిన మైకంలో కాదు. తప్పు చేస్తున్నానన్న భావంతో అని తెలుస్తూనే వుంది.

"రండి మీ కోసమే మేం ఇంత సేపు ఆగాం" – దివాకర్ కంగారుపడుతున్నాడు. జయ గుండెల్ని అరచేతిలో పట్టుకుంది – కానీ విజయ చాలా నింపాదిగా అందా మాట. ఆమె గొంతు చాలా స్థిరంగా వుంది. "చూడండి బావగారూ – మిమ్మల్ని తాగుడు మానమని చెప్పేంత గొప్పవాళ్ళం కాదు. కానీ ఒక్క విషయం మాత్రం చెప్పక తప్పడంలేదు – మీరు తాగుతారో – తందానాలాడతారో మీ ఇష్టం – మీ భార్యాపిల్లల్ని పోషించుకుంటారో – పస్తులు పెట్టుకుంటారో కూడా మీ ఇష్టమే – కానీ మా ఇంటికి మాత్రం పంపకండి. మాకూ పిల్లాజెల్లా వున్నారు. ఈ కరవు రోజుల్లో మేము మాత్రం ఎంతని పెట్టగలం

విజయ అలా మాట్లాడుతుందని ఏ మాత్రం వూహించని – అక్కడ వున్న ముగ్గురికీ ముందు ఆమె ఏమందో అర్థం కాలేదు. అర్థమైన తర్వాత – దివాకర్‌కి అయోమయంతోనూ – జయకి భయంతోనూ – శ్రీనివాస్‌కి రోషం, అభిమానం, అవమానం కలగలసిన భావంతోనూ – ఎవరికి వారికి నోట మాటరాలేదు. ముందుగా తేరుకున్నది శ్రీనివాసే! తేరుకున్న వెంటనే అతను చేసిన పని – భార్యని లాగిపెట్టి చెంపమీద అయిదు వేళ్ళు ముద్రపడేలా కొట్టాడు.

అతనికి సగం తాగిన మైకం కూడా దిగిపోయింది.

"ఏమిటి! ఏమిటి నీ చెల్లి మాట్లాడేది! గతిలేక నా భార్యా కూతురు తిండికోసం వాళ్ళింటికి వెళ్ళారట! నిజమేనా! చెప్పు! అది అబద్ధం అని చెప్పకపోతే నిన్ను, శాంతిని ఈ క్షణంలోనే చంపేస్తాను". అతను ఆవేశంలో వూగిపోతున్నాడు. అక్కడ అంత రణరంగాన్ని సృష్టించి తను మాత్రం నిదానంగా నవ్వింది విజయ. ఆ నవ్వులో అభిమానధనుడైన దుర్యోధనుని మండే అగ్నిపర్వతం చేసిన – పాంచాలి నవ్వులో వున్న అవహేళనా – ఎగతాళీ వున్నాయి. అది సూటిగా గుండెల్ని తాకింది శ్రీనివాస్‌కి.

"ఆగండి! అక్కనెందుకు కొడతారు. అయినా అంతకంటే ఏం చేయగలరు మీరు! భర్తగా ఆమెకి తిండిపెట్టలేరు. బట్టలియ్యలేరు. కనీసం కొట్టనైనా కొడితేనేగా ఆమెకి భర్తగా మిమ్మల్ని మీరు నిరూపించుకోగలిగేది! అక్కకాదు నా ఇంటికి వచ్చింది. కడుపునిండా తిండిలేదు కాబట్టే – కడుపులో కుళ్ళూ కల్మషాలు లేని పాప నా ఇంటికి వచ్చింది. నాలుగయిదు రోజులుగా అది మధ్యాహ్నం మా ఇంట్లోనే తింటోంది. అక్కకి తెలిసినా ఊరుకుంది అంటే – కనీసం అదైనా కడుపునిండా తింటుందనే ఉద్దేశ్యంతోనే" కొంచెం ఆగి బావగారివైపు తీవ్రంగా చూస్తూ –

"మీకున్న రోషం; పౌరుషం, అభిమానం – అక్కని, పాపని కొట్టి నిరూపించుకుంటే ఫలితం లేదు. వాళ్ళకి మీరంటే ఇంకాస్త అసహ్యం పుట్టి మీరు భార్యాపిల్లల ప్రేమకు కూడా నోచుకోకుండా పోతారు. మీరు నిజంగా పౌరుషం వున్న మగాడయితే – మీ భార్యని, కూతుర్ని – మరొకరు వేలెత్తి చూపకుండా – పువ్వుల్లో పెట్టి చూసుకోండి. నా మీద మీ కసి తీర్చుకోవాలంటే మీ కంతకంటే మార్గం లేదు."

అంటూనే – పక్కపక్కనే మంచం మీద నిద్రపోతున్న బాబిగాడ్ని ఎత్తి భర్తకిచ్చి – శాంతిని తన భుజం మీద వేసుకుంది విజయ. నిశ్చేష్టులై చూస్తున్నారు జయ, శ్రీనివాస్‌లు. "చూడండి బావగారూ! ఏదో అన్నాను గానీ – నా అక్క పిల్ల పస్తులతో మాడుతుంటే నేను తట్టుకోలేను. మీ కూతురి కింత తిండి పెట్టగలిగిననాడు వచ్చి దీన్ని తీసుకెళ్ళండి" చెప్పి దివాకర్ వెనుకే నడిచింది విజయ. గుమ్మం దాటబోతున్న విజయని పరుగులాంటి నడకతో వచ్చి ఆపాడు శ్రీనివాస్. విజయ భుజంమీద వున్న పాపని లాక్కుని తన గుండెలకి హత్తుకున్నాడు.

"మరీ అలా మాట్లాడేశావేంటి? పాపం ఆయనెంత బాధపడ్డారో" దివాకర్ అన్నాడు రోడ్డుమీద నడుస్తూ. అప్పటికీ పూర్తిగా తేరుకోలేదతను. "అయినా ఎందుకలా మాట్లాడావ్" మళ్ళీ అడిగాడు భార్యని –

"ఆలుబిడ్డల ఆకలిమంటలకన్నా – మధ్యతరగతి మానవుడికి తన ఆత్మాభిమానమే ఎక్కువని నమ్మి..." టక్కున అంది. ఆమె మాటల్లో తన అభిప్రాయం పట్ల పూర్తి నమ్మకం. ఆ నమ్మకం నిజమయింది కూడా!